క్లుప్తంగా

పరీక్ష ప్యాడ్ల పంపిణీ



ఖిల్లాఘనపురం: పది పరీక్షల్లో విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలని యువశక్తి ఫౌండేషన్ వ్యవస్థాపకుడు మధు అన్నారు. బుధవారం మండలంలోని అప్పారెడ్డిపల్లి, కస్తూర్బా గాంధీ పాఠశాలల్లో పదో తరగతి విద్యార్థులకు యువశక్తి ఫౌండేషన్ ఆధ్వర్యంలో పరీక్ష ప్యాడ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో అంజనేయులు, శివ, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

అందుబాటులో సబ్సిడీ కవర్లు



వీపనగండ్ల: ఉద్యానశాఖ ఆధ్వర్యంలో మామిడి రైతులకు 50 శాతం సబ్సిడీతో మామిడి కాయలకు కట్టే కవర్లను అందజేస్తున్నామని, ఆ అవకాశాన్ని మామిడి తోటల రైతులు సద్వినియోగం చేసుకోవాలని మండల ఉద్యానవనశాఖ అధికారి కృష్ణ తెలిపారు. ఒక కవరు రూ.2.60 ఉంటుందని, ఒక ఎకరాకు 5వేల కవర్లు అవసరం అవుతాయని, మొత్తం వీటి విలువ రూ.13వేలు కాగా అందులో 50శాతం సబ్సిడీ పోగా రూ.6,500 చెల్లించాలని సూచించారు. ఒక రైతుకు ప్రస్తుతానికి ఒక ఎకరాకు మాత్రమే సబ్సిడీ కవర్లు పొందే అవకాశం ఉందని, ఈ అవకాశాన్ని మామిడి రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

ఈత చెట్ల నరికివేతపై ఫిర్యాదు



పెబ్బేరు: మండలంలోని గుమ్మడంలో ఈత చెట్లను నరికేసిన వారిపై కేసు నమోదు చేయాలని జిల్లా గౌడ సంఘం ఆధ్వర్యంలో బుధవారం జిల్లా అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా జిల్లా గౌడ సంఘం సభ్యులు గుమ్మడం గ్రామాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈత చెట్లను నరికిన వ్యక్తులపై అధికారులు కేసు నమోదు చేయాలని, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ఎక్సైజ్ అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో భగవంతుగౌడ్, రవీందర్‌గౌడ్, సంగమేశ్వర్‌గౌడ్, వినోద్, వెంకటేష్‌గౌడ్ రాజశేఖర్‌గౌడ్, రాఘవేందర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఒత్తిడిని జయించాలి



పాన్‌గల్: వచ్చే నెల 3వ తేదీ నుంచి ప్రారంభమయ్యే పదో తరగతి పబ్లిక్ పరీక్షలను విద్యార్థులు ఒత్తిడి, భయం లేకుండా రాయాలని ఎంపీపీ మామిళ్లపల్లి శ్రీధర్‌రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని చిక్కేపల్లి ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థుల వీడ్కోలు సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. వార్షిక పరీక్షల్లో ఉత్తమ గ్రేడ్ సాధించిన విద్యార్థులకు రూ.5వేలు అందజేస్తానని ఈ సందర్భంగా హామీ ఇచ్చారు. అనంతరం విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లను అందజేశారు. సమావేశంలో సర్పంచ్ బాలస్వామియాదవ్, వెంకట్రాములుయాదవ్, హెచ్‌ఎం లక్ష్మీనారాయణ, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

క్షయపై అవగాహన సదస్సు



పెబ్బేరు రూరల్: శ్రీరంగాపురం మండలంలోని కంభాళాపురంలో బుధవారం కంటివెలుగు, క్షయ వ్యాధి నివారణపై ప్రభుత్వ కళాజాతా బృందం వారు ఆట పాటలతో ప్రజలకు అవగాహన కల్పించారు. గ్రామంలో అందరూ కంటి వెలుగు కార్యక్రమాన్ని వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారి పవన్ కుమార్, సూపర్‌వైజర్ సత్యమ్మ, ఏఎన్‌ఎంలు, ఆశాకార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

చిన్నారుల సంఖ్య పెంచాలి

కొత్తకోట రూరల్: పెద్దమందడి మండలంలోని వివిధ గ్రామాల్లో గల అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారుల సంఖ్యను పెంచాలని అంగన్‌వాడీ టీచర్లకు ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సుధ సూచించారు. బుధవారం మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రం–2లో టీచర్లతో సెక్టార్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సుధ మాట్లాడుతూ ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాలకు సరఫరా చేసే పౌష్టికాహారాన్ని చిన్నారులకు, బాలింతలకు, గర్భిణులకు క్రమం తప్పకుండా అందజేయాలన్నారు. కార్యక్రమంలో రమాదేవి, రాంచంద్రమ్మ, చిట్టెమ్మ, రాణి, అల్వాల రమాదేవి, శారద, ప్రమీల, సరోజ, పద్మ ఉన్నారు.

సైబర్ నేరగాళ్లతో జాగ్రత్త



మద్దిగట్ల జెడ్పీహెచ్‌ఎస్‌లో మాట్లాడుతున్న ఎస్‌ఐ హరిప్రసాద్

అమరచింత: మారుతున్న కంప్యూటర్ విజ్ఞానంతో ప్రపంచం అన్ని రంగాల్లో ముందుకు వెళ్తున్న కారణంగా సాంకేతికను కొంతమంది తమ వ్యక్తిగత అవసరాల కోసం వాడుకొంటూ సైబర్ నేరాలకు పాల్పడుతున్నారని ఎస్‌ఐ శివనాగేశ్వర నాయుడు అన్నారు. మండలంలోని కేజీబీవీతో పాటు పట్టణంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో బుధవారం విద్యార్థులకు సైబర్ నేరాల గురించి అవగాహన కల్పించారు.

బ్యాడ్జీల పంపిణీ

పాఠశాలలో చదువుతూ పోలీసు శాఖ ఇచ్చిన శిక్షణలో పాల్గొన్న విద్యార్థులకు ఎస్‌ఐ శివనాగేశ్వర నాయుడు చేతుల మీదుగా బ్యాడ్జీలు ధరింపచేశారు. పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్న సంధ్య, అఫ్నా, ఎనిమిదో తరగతి చదువుతున్న వరప్రసాద్‌కు బ్యాడ్జీ అందించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం బలరాముడు, ఉపాధ్యాయులు స్వామి, సురేష్, రాజేష్, దేవేంద్రం, వెంకటన్న, శ్రీనివాసులు పాల్గొన్నారు.

కొత్తకోట రూరల్: సైబర్ నేరాలు రోజురోజుకూ పెరుగుతుండటంతో విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని పెద్దమందడి ఎస్‌ఐ హరిప్రసాద్ సూచించారు. బుధవారం పెద్దమందడి మండలంలోని మద్దిగట్ల జెడ్పీహెచ్‌ఎస్‌లో విద్యార్థులకు సైబర్ నేరగాళ్ల బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. ఇంటర్‌నెట్ వినియోగంలో అప్రమత్తంగా ఉండాలని, ఎలాంటి విషయమైనా తల్లిదండ్రులతో చర్చించాలన్నారు. ఆపదలో ఉన్నవారు టోల్ ఫ్రీ నంబర్లు 108, 100, 1098, 181లకు ఫోన్ చేసి పోలీసు, ఇతర శాఖల యంత్రాంగం సూచనలను పొందాలన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం ఈశ్వరాచారి తదితరులు పాల్గొన్నారు.

పాన్‌గల్: సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్‌ఐ నాగన్న అన్నారు. బుధవారం మండలంలోని కేతేపల్లిలో గ్రామస్తులు, ఉన్నత పాఠశాల విద్యార్థులకు సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలియని వ్యక్తులకు ఎట్టి పరిస్థితులల్లో ఆధార్, బ్యాంకు ఖాతా వివరాలను తెలియపర్చకూడదన్నారు. సైబర్ నేరాలపై విద్యార్థులు గ్రామాల్లో అవగాహన కల్పించి ప్రజలను అప్రమత్తం చేయాలని సూచించారు.

గోపాల్‌పేట: సైబర్‌నేరాలు ఎక్కువగా జరుగుతున్న నేపథ్యంలో విద్యార్థులు వాటిపై అవగాహన కలిగి ఉండాలని ప్రధానోపాధ్యాయుడు రమాకాంత్ అన్నారు. బుధవారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆరుగురు విద్యార్థులను సైబర్ అంబాసిడర్లుగా ఎంపిక చేశారు.

పెబ్బేరు: రంగాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సైబర్ నేరాలు, సైబర్ అంబాసిడర్‌పై బుధవారం పోలీసులు విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఏఎస్‌ఐ వెంకట్‌రెడ్డి హాజరై మాట్లాడుతూ ప్రస్తుతం సెల్ ఫోన్ల వినియోగించడంలో కొన్ని జాగ్రత్తలు తీసుకున్నట్లయితే సైబర్ మోసాల నుంచి బయటపడవచ్చని, సెల్‌ఫోన్లలో ఆధునిక టెక్నాలజీని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల ఇన్‌చార్జ్ ప్రధానోపాధ్యాయులు భాస్కర్, ప్రోగ్రాం ఇన్‌చార్జ్ విజయకుమార్, ఉపాధ్యాయులు నరేందర్‌గౌడ్, గోవర్ధన్‌రెడ్డి, రాంప్రసాద్, రాజశేఖర్‌గౌడ్, నాగన్న, వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఖిల్లాఘనపురం: ప్రస్తుతం సమాజంలో జరుగుతున్న సైబర్ నేరాలపై ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని ఎస్‌ఐ శ్రీహరి అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని తెలుగు, ఇంగ్లిష్ మీడియం కస్తూర్బా గాంధీ పాఠశాలల్లో పోలీసు శాఖ ఆధ్వర్యంలో విద్యార్థులకు సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. అనంతరం విద్యార్థులకు ఆయన పరీక్ష ప్యాడ్లు పంచారు.

'రాహుల్'పై వేటు సరికాదు

చిన్నంబావి: రాహుల్ గాంధీపై అనర్హత వేటు వేయడాన్ని నిరసిస్తూ బుధవారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ప్రధానమంత్రి నరేంద్రమోదీ దిష్టిబొమ్మను దహనం చేశారు. మండల కేంద్రంలోని ప్రధాన చౌరస్తాలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు శేఖర్ యాదవ్, కిసాన్ సెల్ మండల అధ్యక్షుడు నంది పుల్లారెడ్డి, వెంకటస్వామి, రామచందర్ సాగర్, దగడపల్లి ఉపసర్పంచ్ గంగాధర్, రాములు, మైనారిటీ నాయకులు మునీర్, హన్మంత్ యాదవ్, శివయ్య పాల్గొన్నారు.

అంబేడ్కర్ విగ్రహానికి వినతి

పాన్‌గల్: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వానికి కనువిప్పు కలిగిస్తూ ప్రతిపక్షాలపై కక్ష్య సాధింపు చర్యలు మానుకోవాలని కోరుతూ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో బుధవారం మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పార్టీ ఓబీసీ జాతీయ కోఆర్డినేటర్ డా.కేతూరి వెంకటేష్ మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం భారత రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధంగా పాలన సాగిస్తున్నారని, ప్రశ్నించే గొంతులను నొక్కి పెడుతూ అరెస్టులు చేయిస్తున్నారని మండిపడ్డారు. రాహుల్‌గాంధీ పార్లమెంట్ సభ్యత్వం రద్దు చేయడంలో బీజేపీ ప్రభుత్వ రాజకీయ కుట్ర దాగి ఉందన్నారు. కార్యక్రమంలో ఓబీసీ జిల్లా అధ్యక్షుడు కోట్ల రవి, మండల నాయకులు లక్ష్మణ్, రమేష్‌రాథోడ్, జంగయ్యాచారి, ఫరీద్, శివరాజు, పాపిరెడ్డి, చీర్లచందర్ పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణే ధ్యేయం



ప్రతిజ్ఞ చేస్తున్న చైర్‌పర్సన్, విద్యార్థులు

అమరచింత: ప్లాస్టిక్ వాడకాన్ని ప్రతి ఒక్కరూ నియంత్రిస్తూ పర్యావరణాన్ని కాపాడుకునేందుకు ప్రజలు ముందుకు రావాలని మున్సిపల్ చైర్‌పర్సన్ గాయత్రి, వైస్ చైర్మన్ విజయభాస్కర్‌రెడ్డి అన్నారు. ఆత్మకూర్ పట్టణంలో బుధవారం స్వచ్ఛోత్సవ్‌లో భాగంగా స్వచ్ఛత ర్యాలీని పట్టణ పురవీధుల గుండా నిర్వహించారు. అనంతరం చౌరస్తాలో విద్యార్థులతో కలిసి ప్రతిజ్ఞ చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ మారుతున్న కాలానికి అనుగుణంగా వాతవరణంలో ఎన్నో మార్పులు వస్తున్నాయని, స్వచ్ఛమైన గాలి లభించడం కష్టమైందన్నారు. ఎక్కడ పడితే అక్కడ ప్లాస్టిక్ కవర్లు, గ్లాసులు, బాటిళ్లను వినియోగించి పారవేయడంతో పర్యావరణం దెబ్బతింటున్నదన్నారు. భూమిలో అవి అవశేషాలుగా మిగిలి పంటలు పండించే సామర్థ్యం కోల్పోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతి ఒక్కరూ బట్ట సంచులను వినియోగించాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ బీఎన్‌కే రమేష్ తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలను అరికట్టాలి



అవగాహన కల్పిస్తున్న అధికారులు

మదనాపురం: మండల మహిళా సమాఖ్య కార్యాలయంలో బుధవారం మహిళా సంఘం అధ్యక్షురాలు, సభ్యులు, వీఓఏ లకు జిల్లా బాలల సంరక్షణ అధికారి రాంబాబు బాల్య వివాహ నిషేధ చట్టం, బాల్య వివాహాలపై అవగాహన కల్పించారు. 18 ఏళ్ల లోపు అమ్మాయిలకు, 21 లోపు అబ్బాయిలకు వివాహం చేయడం చట్టరీత్యా నేరమని, ఇలాంటి వాటికి పాల్పడితే చర్యలు తప్పవన్నారు. అనంతరం సంరక్షణ అధికారి సురేందర్ చట్టబద్ధమైన దత్తత గురించి అవగాహన కల్పించారు. బాలల న్యాయ చట్టం 2015 ప్రకారం కేంద్రీయ దత్తత వనరుల సంస్థలో రిజిస్ట్రేషన్ చేసుకోవడం ద్వారా పిల్లలను చట్టబద్ధంగా దత్తత తీసుకోవచ్చని, సీనియారిటీ ప్రకారంగా పిల్లల్ని దత్తత ఇస్తారని తెలిపారు. నిబంధనలు అతిక్రమిస్తే మూడేళ్ల జైలు, లక్ష జరిమానా లేదా రెండు శిక్షలకి అర్హులవుతారని పేర్కొన్నారు. కార్యక్రమంలో డీపీఎం ప్రభాకర్, సీడీపీఓ భారతి, సీసీలు దయానంద్, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ బడ్జెట్ రూ.12.52 కోట్లు



సమావేశంలో పాల్గొన్న సభ్యులు

పెబ్బేరు: పురపాలక సంఘం కార్యాలయంలో బుధవారం 2023–24 ఆర్థిక సంవత్సరానికి గాను రూ.12.52 కోట్ల బడ్జెట్‌ను రూపొందించారు. బడ్జెట్‌పై ప్రత్యేక సర్వసభ్య సమావేశానికి చైర్‌పర్సన్ కరుణశ్రీ అధ్యక్షత వహించారు. అలాగే కమిషనర్ ఆదిశేషు బడ్జెట్ అంచనాలు, ఎజెండాను చదివి వినిపించారు. 2023–24 సంవత్సరానికి సాధారణ నిధుల అంచనా ఆదాయం రూ.75.4లక్షలు, క్యాపిటల్ వ్యయం, ఆదాయం రూ. 48.8 లక్షలు, డిపాజిట్లు, లోన్స్ రూ.40 లక్షలుగా ప్రతిపాదించారు. దీనికి కౌన్సిలర్లు ఏకగ్రీవంగా ఆమోదం పలికింది. కార్యక్రమంలో వైస్ చైర్మన్ కర్రెస్వామి, కౌన్సిలర్లు ఎల్లారెడ్డి, ఎల్లస్వామి, గోపిబాబు, పార్వతిగౌడ్, సువర్ణ, స్వాతి, పద్మ, సుమతి, అక్కమ్మ, రామకృష్ణ, మున్సిపల్ మేనేజర్ గణేష్‌బాబు, ఏఈ రమేష్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం

పాన్‌గల్: రేమద్దులకు చెందిన కిల్లె శంకర్ ఇటీవల విద్యుత్ షాక్‌తో మృతిచెందడంతో బీఆర్‌ఎస్ నాయకుడు పీట్లకతాల్ రూ.30 వేలను బాధిత కుటుంబ సభ్యుల పేరు మీద పోస్టాఫీసులో జమ చేసి దానికి సంబంధించిన బాండును బుధవారం అందజేశారు. దీంతో పాటు ఇదే గ్రామానికి చెందిన మాలశంకర్ పక్షవాతంతో బాధపడుతుండటంతో రూ.30 వేలను ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో కర్ణాకర్‌రెడ్డి, తిరుపతయ్య పాల్గొన్నారు.

విద్యార్థికి గాయాలు

గోపాల్‌పేట: ద్విచక్రవాహనం చెట్టుకు ఢీకొట్టడంతో పదోతరగతి చదువుతున్న విద్యార్థికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు.. మండల కేంద్రంలోని చిన్నవడ్డెగేరికి చెందిన శంకరయ్య, లక్ష్మి దంపతులు కుమారుడు వల్లెపు దినేష్ ప్రభుత్వ పాఠశాలలో పదోతరగతి చదువుతున్నాడు. బుధవారం ఉదయం దినేష్ స్నేహితుడితో కలిసి బైక్‌పై తాడిపర్తి వైపు బయల్దేరాడు. గొల్లోనిమిట్ట సమీపంలో ద్విచక్రవాహనం అదుపుతప్పి చెట్టుకు ఢీకొట్టింది. దీంతో వాహనంపై ఉన్న ఆరీఫ్‌కు స్వల్ప గాయాలు కాగా దినేష్‌కు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు గుర్తించి వెంటనే ఇద్దరిని అంబులెన్స్‌లో ఆస్పత్రికి తరలించారు. దినేష్ పరిస్థితి విషమంగా ఉండటంతో హైదరాబాద్‌కు తరలించారు. తమ అబ్బాయిని ద్విచక్రవాహనంపై ఎక్కించుకొని వెళ్లి గాయాలపాలు చేశాడని స్నేహితుడిపై పోలీసులకు ఫిర్యాదు చేసినా కేసు నమోదు చేయట్లేదని కుటుంబ సభ్యులు వాపోయారు.

సాగునీటి విడుదలకు రైతుల రాస్తాకోరో



మాట్లాడుతున్న నాగరాజ్ గౌడ్

అమరచింత: ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టు ప్రధాన ఎడమ కాల్వ ఆయకట్టుకు వారాబంధి ద్వార సాగునీరును అందిస్తున్న అధికారులు గడువు ముగిసిందని సాగునీటిని నిలిపివేయడంతో రైతులు ఆత్మకూర్ తహసీల్దార్ కార్యాలయం వద్ద బుధవారం ఆందోళన నిర్వహించారు. సాగునీరు అందక వరి పంటలు ఎండిపోతున్నాయని కాంగ్రెస్ నాయకులు మరికల్, ఆత్మకూర్ ప్రధాన రహదారిపై మూడు గంటల పాటు రాస్తారోకో నిర్వహించారు. దీంతో వాహనాల రాకపోకలు నిలిచిపోవడంతో ప్రయానికులు ఇబ్బందులు పడ్డారు. ఆత్మకూర్ సీఐ ఎస్‌కే రత్నం ఆందోళన చేస్తున్న వారిని శాంతింపచేస్తు ప్రాజెక్టు అధికారులతో సాగునీటి కోసం చర్చలు జరిపించారు. ఈమేరకు టీపీసీసీ అధికార ప్రతినిధి కేశం నాగరాజ్ గౌడ్ మాట్లాడుతూ ఆత్మకూర్ మండలంలో జూరాల ప్రధాన ఎడమ కాల్వకు అనుసంధానంగా ఉన్న డీ–6 కాలువతో కట్ట కింది పల్లెలు సాగునీటిని పొందుతున్నారని తెలిపారు. మండలంలోని జూరాల, ఆరేపల్లి, తూంపల్లి, కత్తెపల్లి, మొట్లంపల్లి గ్రామాల్లో సుమారు 9 వేల ఎకరాల్లో రైతులు వరిని సాగుచేసుకున్నారన్నారు. అనంతరం సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని తహసీల్దార్ సింధూజకు అందించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పరమేష్, తులసీరాజ్, రహ్మతుల్లా, గంగాధర్‌గౌడ్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛ గ్రామాలుగా తీర్చిదిద్దండి



పెబ్బేరులో అవగాహన కల్పిస్తున్న అధికారులు

పాన్‌గల్: సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు సమన్వయంతో పనిచేస్తూ గ్రామాలను స్వచ్ఛ గ్రామాలు మార్చాలని ఎంపీడీఓ నాగేశ్వర్‌రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని శాగాపూర్‌లో స్వచ్ఛ భారత్ మిషన్ కార్యక్రమాలపై సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు, వీబీకేలకు రెండో రోజు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయా అంశాలపై ఎస్‌బీఎం జిల్లా అధికారులు రమేష్, ఫరీదా, సత్యం సిబ్బందికి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏపీఓ కురుమూర్తి, ఎంపీఓ రఘురాములు, స్థానిక సర్పంచ్ మానికయాదవ్, ఎంపీటీసీ సుబ్బయ్యయాదవ్, మండల కోఆప్షన్ సభ్యులు హలీమ్‌పాష తదితరులు పాల్గొన్నారు.

పెబ్బేరు: పట్టణ కేంద్రంలోని మున్సిపాలిటీ ఆధ్వర్యంలో స్వచ్ఛతపై బుధవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ కరుణశ్రీ, కమిషనర్ ఆదిశేషులు మాట్లాడుతూ సీఎండీఏ, కలెక్టర్ ఆదేశాల మేరకు పట్టణాన్ని స్వచ్ఛత వైపు నడిపించేందుకు ప్రజలు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో మేనేజర్ గణేష్ బాబు, జూనియర్ అసిస్టెంట్ రాజశేఖర్‌రెడ్డి, మెప్మా రాధ, యోగేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలు పాటించకుంటే చర్యలు

పెబ్బేరు: పట్టణ కేంద్రంలోని పోలీస్ శాఖ ఆధ్వర్యంలో బుధవారం నంబర్ ప్లేట్స్ లేకుండా తిరుగుతున్న వాహనాలను పోలీసులు పట్టుకుని జరిమానా విధించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ జగదీశ్వర్ మాట్లాడుతూ ఎస్పీ రక్షిత్‌మూర్తి ఆదేశాల మేరకు పట్టణంలో స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్న క్రమంలో నంబర్ ప్లేట్స్ లేని వాహనాలు, పెండింగ్ చలాన్ ఉన్న మొత్తం 15 వాహనాలు పట్టుకోవడం జరిగిందని ఎస్‌ఐ జగదీశ్వర్ తెలిపారు.

కాంగ్రెస్ హయాంలోనే సుపరిపాలన సాధ్యం



చిన్నారెడ్డికి స్వాగతం పలుకుతున్న కార్యకర్తలు

ఖిల్లాఘనపురం: రాష్ట్రంలో కాంగ్రెస్ పాలనతోనే ప్రజలకు సుపరిపాలన అందుతుందని మాజీమంత్రి, ఏఐసీసీ కార్యదర్శి చిన్నారెడ్డి అన్నారు. బుధవారం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో మండలంలోని పర్వతాపురం, మామిడిమాడ, సల్కెలాపురం, సలెకలాపురం తండా, అప్పారెడ్డిపల్లి, మల్కిమియాన్‌పల్లి, మల్కిమియాన్‌పల్లి తండాలు, అల్లమాయపల్లిలో హాథ్ సే హాథ్ జోడో యాత్ర నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా దివ్యాంగుల సంఘం అధ్యక్షుడు రమేష్, వర్కింగ్ ప్రెసిడెంట్ దేవిజా నాయక్, ఎంపీటీసీ సభ్యులు మల్లేష్‌యాదవ్, నాయకులు కృష్ణయ్య యాదవ్, ఎన్‌ఎస్‌యుఐ జిల్లా అధ్యక్షుడు రోహిత్, దేవన్న యాదవ్, డాక్టర్ నరేందర్‌గౌడ్ పాల్గొన్నారు.

పరీక్ష కేంద్రాల్లో వసతుల పరిశీలన

పాన్‌గల్: వచ్చే నెల 3వ తేదీ నుంచి ప్రారంభమయ్యే పదో తరగతి పరీక్షలకు సంబంధించి మండల కేంద్రంలోని బాలుర, బాలికల ఉన్నత పాఠశాలల్లో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రాల్లో బుధవారం మండల ప్రత్యేకాధికారి సురేష్, ఎంఈఓ లక్ష్మణ్‌నాయక్ వసతులను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పరీక్ష కేంద్రాల్లో విద్యార్థులకు ఇబ్బందులు కలుగకుండా అన్ని రకాల మౌలిక వసతులను కల్పించాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో హెచ్‌ఎంలు విష్ణువర్ధన్‌రెడ్డి, మంజుల, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

కల్యాణలక్ష్మి చెక్కుల అందజేత

కొత్తకోట: పట్టణ కేంద్రంలోని స్థానిక మున్సిపాలిటీ కార్యాలయంలో బుధవారం 8 మంది లబ్ధిదారులకు కల్యాణ లక్ష్మి, షాదీముబారక్, ఏడుగురికి రూ. 4,12,500ల విలువ గల సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి లబ్ధిదారులకు అందజేశారు. అంతకుముందు మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన పురపాలక సంఘం 2023–24 ఆర్థిక సంవత్సరానికి రూపొందించిన నూతన బడ్జెట్ సమావేశంలో ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి, జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పాల్గొని బడ్జెట్‌ను చదివి వినిపించారు. కార్యక్రమంలో కమిషనర్ శ్రీనివాసులు, జెడ్పీ వైస్ చైర్మన్ వామన్‌గౌడ్, కౌన్సిలర్లు నవీన్‌కుమార్‌రెడ్డి, ఖాజమైనోద్దీన్, రాములు యాదవ్, సంధ్య తదితరుల పాల్గొన్నారు.

స్వచ్ఛందంగా కల్యాణ మండపం నిర్మాణం

వీపనగండ్ల: శ్రీరామనవమి ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలన్న సదుద్దేశంతో మండల రైతుబంధు సమితి మాజీ అధ్యక్షుడు నారాయణరెడ్డి తన సొంత ఖర్చులతో వల్లభాపురంలోని ఆలయంలో కల్యాణ మండపంతో పాటు కంపౌండ్ వాల్‌ను నిర్మించారు. గురువారం జరిగే శ్రీరామనవమి కల్యాణాన్ని కూడా తానే స్వయంగా నిర్వహించి అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామంలోని ప్రజలు, ప్రజాప్రతినిధులు, అధిక సంఖ్యలో పాల్గొనాలని ఆయన కోరారు.

నిరుద్యోగ యువతకు ఇంటర్వ్యూలు

కొత్తకోట రూరల్: ముస్లిం మైనార్టీ రుణాల కోసం దరఖాస్తు చేసుకున్న వారికి బుధవారం పెద్దమందడి మండలంలోని మహిళా సమాఖ్య భవనంలో ఎంపీడీఓ అఫ్జల్, ఎంపీఓ శ్రీరాంరెడ్డి, ఏపీజీవీబీ బ్యాంక్ ఫీల్డ్ ఆఫీసర్లు అరుణ్, చంద్రమౌళి ఇంటర్వ్యూలు నిర్వహించారు. మండలానికి నాలుగు యూనిట్లు మంజూరు కాగా 73మంది మైనార్టీ యువత దరఖాస్తు చేసుకున్నారు. వీరిలో 53మంది ఇంటర్వ్యూకు హాజరైనట్లు ఎంపీడీఓ అఫ్జల్ తెలిపారు.

అమరచింత: ముస్లిం మైనార్టీల కోసం మైనార్టీ కార్పొరేషన్ ద్వారా మంజూరైన మూడు యూనిట్లకు బుధవారం ఎంపీడీఓ కార్యాలయంలో యూనియన్ బ్యాంక్ సబ్ మేనేజర్ బస్వరాజ్, ఎంపీడీఓ జ్యోతి నిరుద్యోగ యువతకు ఇంటర్వ్యూలు నిర్వహించారు.

సీఎంఆర్‌ఎఫ్ పేదలకు వరం

పాన్‌గల్: సీఎం సహాయనిధి పథకం పేద వర్గాలకు వరం లాంటిదని కొల్లాపూర్ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని బండపల్లికి చెందిన ఉదయ్‌కుమార్‌కు రూ.25వేలు, భాగ్యమ్మకు రూ.7,500 చెక్కులను ఆయన అందజేశారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ రఘుపతి నాయుడు, సుగ్రీవుడు, సుదర్శన్‌నాయుడు, సుధాకర్, నాగరాజు, రమేష్‌నాయుడు, సాయిబాబ, భాను, బాలరాం, రాముడు పాల్గొన్నారు.

పోషకాహారంనే రక్తహీనత దూరం



శాగాపూర్‌లో పౌష్టికాహారంపై అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

పాన్‌గల్: గర్భిణులు, బాలింతలు క్రమం తప్పకుండా పౌష్టికాహారం తీసుకుంటే రక్తహీనత దూరం చేయొచ్చని శాగాపూర్ సర్పంచ్ మానికయాదవ్ అన్నారు. బుధవారం గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ పక్వాడ కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించారు.

పెబ్బేరు రూరల్: చిరుధాన్యాలతో కూడిన పోషకాహారంపై కిశోర బాలికలు ప్రత్యేక శ్రద్ధ వహించాలని సీడీపీఓ లక్ష్మమ్మ తెలిపారు. పోషకాహార వారోత్సవాల సందర్భంగా ఆమె బుధవారం శ్రీరంగాపురం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర పాఠశాలలో చిరుధాన్యాలు, పోషకాహారంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. అనంతరం అంగన్‌వాడీ సెంటర్ 5లో సూపర్‌వైజర్ లక్ష్మీదేవి పోషకాహారంపై గర్భిణులు, బాలింతలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం కురుమయ్య, కృష్ణవేణి, ఉపాధ్యాయులు ఎల్లస్వామి, కార్యదర్శి నంద కిషోర్, అంగన్‌వాడీ టీచర్లు మంజులారాణి, శాంతాబాయి, కైసర్‌బేగం, రాధ, కవిత పాల్గొన్నారు.

వీపనగండ్ల: తూంకుంటలోని రెండో అంగన్‌వాడీ కేంద్రంలో ఏర్పాటు చేసిన పోషక పదార్థాల ప్రదర్శనను సీడీపీఓ లక్ష్మమ్మ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆడపిల్లలు పుట్టడం అదృష్టంగా భావించాలని, వారి ఎదుగుదల అంగన్‌వాడీ కేంద్రాల్లోనే మొదలవుతుందని తెలిపారు. కార్యక్రమంలో సెక్టార్ సూపర్‌వైజర్ లక్ష్మీనారాయణమ్మ, ఉపాధ్యాయురాలు శిరీష, అంగన్‌వాడీ టీచర్లు పలుస లక్ష్మి, పారిజాత, మాధవి, సుగుణాభాయి, క్రిష్ణమ్మ, రాధ, సువర్ణ, కమల, మహేశ్వరి, చంద్రకళ, మహిళలు, అంగన్‌వాడీ హెల్పర్లు పాల్గొన్నారు.

బాలిక అదృశ్యం: కేసు నమోదు

గోపాల్‌పేట: తాడిపర్తికి చెందిన ఓ యువతి అదృశ్యం అయ్యిందని, వారి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కిడ్నాప్ కేసు నమోదు చేశామని గోపాల్‌పేట ఏఎస్‌ఐ శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు.. తాడిపర్తికి చెందిన మైనర్ బాలిక, అదే గ్రామానికి చెందిన ఓ యువకుడితో కొంతకాలంగా సన్నిహితంగా ఉంటుందని తెలిసి కుటుంబ సభ్యులు ఆ యువకుడిని హెచ్చరించారు. బుధవారం అమ్మాయి ఇంటర్ రెండో సంవత్సరం పరీక్ష రాసేందుకు అన్నతో పాటు గోపాల్‌పేటకు వచ్చింది. పరీక్ష తర్వాత ఆ అమ్మాయిని తీసుకువెళ్లేందుకు వచ్చిన అన్నకు ఎంత వెతికినా కనిపించలేదు. దీంతో ఇటీవల హెచ్చరించిన యువకుడిపై అనుమానం ఉందని, అతడే కిడ్నాప్ చేసి ఉంటాడని అమ్మాయి కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేశామని ఏఎస్‌ఐ తెలిపారు.

పాన్‌గల్: బుసిరెడ్డిపల్లిలో వ్యక్తి అదృశ్యమైన ఘటనపై బుధవారం కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ నాగన్న తెలిపారు. ఎస్‌ఐ తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన ఈగురమోని సుధాకర్(40) పుట్టుకతో చెవిటి, మూగ. ఇతడు ఇంటి నుంచి 25వ తేదీన పెబ్బేర్ సంతకు వెళ్లి, తిరిగి రాకపోవడంతో ఆందోళన చెందిన కుటుంబ సభ్యులు బంధువులు, తెలిసిన వారి ఇళ్లలో వెతికినా ఆచూకీ లభించలేదు. అతడి భార్య చెన్నమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు. ఇతడి ఆచూకీ తెలిస్తే సెల్ నెం. 87126 70616కు సమాచారం ఇవ్వాలని ఎస్‌ఐ పేర్కొన్నారు.